క్లుప్తంగా

నేడు మెగా వైద్యశిబిరం

తిర్యాణి: పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని మంగి గ్రామంలో మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఎస్సై మాధవ్ గౌడ్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో అన్ని రకాల రోగాలకు సంబంధించిన పరీక్షలు ఉచితంగా చేయడంతో పాటు మందులు అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్అర్బన్: విద్యుత్‌లైన్‌లలో మరమ్మతుల కారణంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ, రావులవాడ, కంచుకోట, మజీద్‌వాడ, బెస్తవాడ, మార్వాడీ జైన్ మందిర్ ప్రాంతాల్లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ లక్ష్మీరాజం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

‘బాధిత కుటుంబానికి అండగా ఉంటాం’



పరామర్శిస్తున్న ప్రవీణ్‌కుమార్

కౌటాల: మండల కేంద్రానికి చెందిన పిట్టల స్వాతి ఇటీవల ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబాన్ని శనివారం బీఆర్‌ఎస్ నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా యువతి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. యువత క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడవద్దన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



చెక్కు అందజేస్తున్న బీజేపీ నాయకులు

పెంచికల్‌పేట్: మండలంలోని గొంట్లపేట్ గ్రామానికి చెందిన అగాడి భీమయ్యకు సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ కాగా శనివారం బీజేపీ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు జునుగరి మధుకర్, నాయకులు దెబ్బటి మహేశ్, బండి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో అంగన్‌వాడీ విద్య

తిర్యాణి: అంగన్‌వాడీలలో ఆటపాటలతో కూడిన విద్య అందుతుందని సీడీపీవో సాదియా రుక్సానా అన్నారు. శనివారం మండలంలోని గంభీరావుపేట గ్రామంలో బాల మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 3 నుంచి 5ఏళ్ల లోపు చిన్నారులను క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలన్నారు. రోజువారీగా అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో పాటు పిల్లల ఎదుగుదల ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తిరుపతమ్మ, మాజీ సర్పంచ్ ముత్యం వరలక్ష్మి తదితరులు ఉన్నారు.

మన్మోహన్ సింగ్‌కు నివాళి




నివాళులర్పిస్తున్న పాత్రికేయులు

దహెగాం: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు శనివారం దహెగాం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. స్థానిక ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ప్రెస్‌క్లబ్ సభ్యులు, మండల నాయకులు, వ్యాపారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాల మౌనం పాటించి సంతాపం తెలిపారు.

ఆలయ కమిటీ సమావేశం

చింతలమానెపల్లి: మండలంలోని గూడెం గ్రామపంచాయితీ శివపెల్లి స్వయంభూ శంభోమహదేవ్ శివాలయంలో శనివారం ఆలయ కమిటీ సభ్యులు సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధిపై చర్చలు జరిపారు. గూడెం గ్రామం నుంచి శివపెల్లి ఆలయం వరకు రహదారి నిర్మాణం కోసం కలెక్టర్ దృష్టికి, కాంగ్రెస్ నాయకురాలు సుగుణ ఆధ్వర్యంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు విన్నవించినట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి చేపట్టబోయే కార్యాచరణ రూపొందించనున్నట్లు సభ్యులు వివరించారు. సభ్యులు బండి ఇస్తారి, కుమురం కనకయ్య, భూష శంకర్ పాల్గొన్నారు.







మంచు.. మసకేసింది..!

కెరమెరి మండల కేంద్రంలో శనివారం పొగమంచు కప్పేసింది. తెల్లవారుజాము నుంచి ఉదయం 7 గంటల వరకు కూడా పొగమంచు దట్టంగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వాహనాల లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగించారు. - కెరమెరి

పెరిగిన ‘ఉపాధి’ లక్ష్యం



నవేగూడలో ఉపాధిహామీ గ్రామసభ (ఫైల్)

- 2025 -26 లక్ష్యం 2.80 లక్షల పని దినాలు
- రూ.14.02 కోట్ల బడ్జెట్
- వ్యవసాయ అనుబంధ పనులకే ప్రాధాన్యం
- గతేడాది లక్ష్యం 2.35 లక్షల పనిదినాలు
- జరిగిన పనులు 3 లక్షల పనిదినాలు

వాంకిడిలో ఉపాధిహామీ పథకం వివరాలు..	గ్రామ పంచాయతీలు	జాబ్‌కార్డులు	పని చేసే కూలీలు
	28	9,960	6,392
	ఈ ఏడాది పని దినాలు	బడ్జెట్	
	2,80,453	రూ.14,02,26,500	

వాంకిడి: గ్రామీణవాసులకు స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా పనులు కల్పిస్తోంది. ఈ మేరకు గతేడాది చేపట్టిన పనులు, పని దినాలను దృష్టిలో పెట్టుకుని 2025 -26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రణాళికలు రూపొందించి ప్రతిపాదనలు పంపించారు. అక్టోబర్, నవంబర్ నెలల్లో మండలంలోని గ్రామ పంచాయతీ కేంద్రాలలో ఉపాధి హామీ గ్రామ సభలు నిర్వహించి కూలీల నుంచి పనులకు సంబంధించిన డిమాండ్‌ల ఆధారంగా పనులు గుర్తింపు ప్రక్రియ పూర్తి చేశారు. గతేడాది నిర్దేశించిన పని దినాల కంటే అధికంగా పనులు జరగడంతో ఈ ఏడాది పని దినాలు, అంచనా బడ్జెట్ లక్ష్యం పెంచి ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు సమర్పించారు.

బడ్జెట్ రూ.14.02 కోట్లు..

వాంకిడి మండలంలో 2025 -26 ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపట్టే పనులకు గాను అంచనా బడ్జెట్ రూ.14,02,26,500 గా ఖరారు చేశారు. గతేడాది 2.35 లక్షల పని దినాలుగా ప్రణాళిక రూపొందించగా లక్ష్యానికి మించి 3 లక్షల పని దినాలు పూర్తి చేశారు. దీంతో ఈ ఏడాది 2,80,453 పని దినాలతో పాటు బడ్జెట్ వ్యయం పెంచి ప్రణాళికలు ఖరారు చేశారు. ప్రస్తుతం మండలంలో మొత్తం జాబ్ కార్డులు 9960 ఉండగా పని చేసే కూలీలు 6392 మంది ఉన్నారు. జాబ్ కార్డు కలిగి ఉన్న కూలీలకు 100 రోజులు పని కల్పించాలనే లక్ష్యంతో ఈ పని దినాలు నిర్ణయించారు. అక్టోబర్, నవంబర్ నెలల్లో నిర్వహించిన గ్రామసభల ద్వారా గతేడాది లాగే వ్యవసాయ అనుబంధ పనులకు ప్రాధాన్యత కల్పించారు. 2025 -26 బడ్జెట్‌లో లేబర్ బడ్జెట్ రూ.8,41,35,900, మెటీరియల్ కంపోనెట్ బడ్జెట్ రూ.5,60,90,600 గా నిర్ణయించారు. ప్రస్తుతం మండలంలో ఉపాధిహామీ నిధులతో నర్సరీ పనులు కొనసాగుతున్నాయి.

వ్యవసాయ అనుబంధ పనులకు ప్రాధాన్యత..

ఉపాధిహామీ పథకంలో భాగంగా గతేడాదిలో కల్పించిన వ్యవసాయ పనులకే ప్రాధాన్యం కల్పించారు. చెరువుల్లో పూడిక తీత, కందకాల తవ్వకం వంటి పనులతో పాటు స్వయం ఉపాధి పొందేలా కోళ్ల పెంపకం, పశువుల పెంపకాలకు షెడ్ నిర్మాణం చేపట్టనున్నారు. వ్యక్తిగతంగా 100 కోళ్ల పెంపకానికి రూ.60 వేలతో షెడ్ నిర్మాణం, కమ్యూనిటీ పౌల్ట్రీ షెడ్ నిర్మాణానికి రూ.3 లక్షల వ్యయంతో 1000 కోళ్ల పెంపకానికి అవకాశాలు కల్పిస్తున్నారు. ఉపాధిహామీ బడ్జెట్‌లో పొలాలకు వెళ్లేందుకు మట్టిరోడ్లు, గ్రామాల్లో అంతర్గత సీసీ రోడ్లు, అంగన్‌వాడీ భవనాలు, డైరీఫాం, భూ అభివృద్ధి పనులు వంటివి అనేక రకాల పనులను కల్పించనున్నారు. కుమురంభీం ప్రాజెక్టు నుంచి వచ్చే ఉప కాలువలలో పూడిక తీత వంటి పనులకు ప్రాధాన్యతనిచ్చారు. ప్రస్తుతం మొక్కల పెంపకానికి నర్సరీ పనులు కొనసాగుతుండగా బ్యాగ్ ఫిల్లింగ్, మొక్కలు నాటడం, గుంతలు తవ్వడం, మొక్కలకు కంచెలు ఏర్పాటు చేయడం, నీళ్లు పట్టడం వంటి తదితర పనులు జరుగుతాయి.

రైతులు దరఖాస్తు చేసుకోవాలి

ఉపాధిహామీ పథకం ద్వారా వ్యవసాయ క్షేత్రాల్లో పనులు చేయించుకోవడానికి రైతులు దరఖాస్తు చేసుకోవాలి. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో కార్యదర్శికి దరఖాస్తు అందజేయాలి. గత ఆర్థిక సంవత్సరం కంటే 2025 -26 ఆర్థిక సంవత్సరానికి లక్ష్యం పెంచి పనిదినాలు కల్పిస్తున్నాం. రైతుల డిమాండ్‌ల ఆధారంగా గ్రామసభల్లో గుర్తించిన ప్రతిపాదనలను పంపించాం.

– శ్రావణ్ కుమార్, ఏపీవో

పకడ్బందీగా సర్వే చేయాలి



కౌటాల: సర్వే పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రసాద్

కౌటాల: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో కోట ప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని ముత్తంపేట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల సర్వేను గడువులోగా పూర్తి చేయాలన్నారు. ప్రతీ లబ్ధిదారుడి పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోని అర్హులైన వారు ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. సర్వేలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి సర్వే క్రాస్ చెకింగ్

వాంకిడి: మండలంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ శనివారం క్రాస్ చెకింగ్ చేశారు. సరాండి, బెండార గ్రామ పంచాయతీలలో చేపడుతున్న సర్వేను పరిశీలించి తన వద్ద ఉన్న లాగిన్‌తో ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాలను పోల్చి చూసి అప్‌లోడ్ చేశారు. అనంతరం నర్సరీలను పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయనతో పాటు ఏపీవో శ్రావణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



వాంకిడిలో..

పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలి

తిర్యాణి: మండలంలో అత్యంత మారుమూల ప్రాంతం పంగిడిమాదరలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఏర్పాటు చేయాలని ఉమ్మడి పంగిడిమాదర మాజీ సర్పంచ్ తుంరం గోపాల్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని పంగిడిమాదర గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామం చుట్టూ దాదాపు 20కి పైగా ఆదివాసీ గూడేలు, ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయన్నారు. అందుబాటులో ఆరోగ్య కేంద్రం లేకపోవడంతో ప్రతీ చిన్న దానికి తిర్యాణి, గిన్నెదరి పీహెచ్‌సీలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. మండల కేంద్రంలో 2కిలోమీటర్ల పరిధిలోనే సీహెచ్‌సీతో పాటు పీహెచ్‌సీ ఉందని అక్కడి పీహెచ్‌సీ పంగిడిమాదర తరలిస్తే మారుమూల ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న తుంరం గోపాల్

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రెబ్బెన: పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. పంచాయతీ కార్మికులు చేపట్టిన టోకెన్ సమ్మెలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని వెంటనే జేఏసీ నాయకత్వంతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలన్నారు. పంచాయతీ కార్మికుల బకాయి వేతనాలను వెంటనే చెల్లించి, వేతనాల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. పంచాయతీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కింద రూ. 5లక్షలు చెల్లించాలన్నారు. జేఏసీ నాయకులు సుధాకర్, రమేశ్, వెంకటేశ్, శంకర్, దేవాజీ, ప్రవీణ్, శంకర్, శ్రీనివాస్, లక్ష్మి, రాజమ్మ, రాజేశ్వరీ, లక్ష్మీ, పద్మ తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న పంచాయతీ కార్మికులు

డిమాండ్ల సాధనకు కొనసాగుతున్న సమ్మె



సమ్మె చేస్తున్న ఉద్యోగులు

ఆసిఫాబాద్‌రూరల్: తమ న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని సమగ్రశిక్షా ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షురాలు శృతిక అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట వారు చేస్తున్న సమ్మె 19వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమగ్రశిక్షా ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం, జీవితబీమా రూ. 10 లక్షలు, ఆరోగ్య బీమా సౌకర్యం, పదవీ విరమణ బెనిఫిట్స్, 12 నెలల వేతన స్కేల్‌లు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్షా సిబ్బంది తుకారాం, మోహన్, నగేశ్, సంతోష్, రాజేశ్, ప్రశాంత్, మల్లేశ్, రమాదేవి, ధర్మయ్య, ఆనంద్ రావు, లత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొత్త సంవత్సర వేడుకలు శాంతియుతంగా నిర్వహించాలి

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా కేంద్రంలో నూతన సంవత్సర వేడుకలను శాంతియుతంగా జరిగేలా భద్రత కట్టుదిట్టం చేసేలా చర్యలు తీసుకోవాలని శనివారం జిల్లా కేంద్రంలో సీఐ బుద్దె రవీందర్‌కు డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ న్యూ ఇయర్ వేడుకల్లో కొందరు మందుబాబులు, ఆకతాయిలు విచ్చలవిడిగా వేడుకల్లో వాహనాలపై తిరుగుతూ ప్రజల ను భయభ్రాంతులకు గురి చేసే అవకాశం ఉందన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. డీవైఎఫ్ఐ అధ్యక్షుడు టీకానంద్, కార్యదర్శి కార్తీక్, సహాయకార్యదర్శి రాజ్‌కుమార్ ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పల్లెల్లో పత్తాలాట..!

- ఈ నెలలో ఐదుగురిపై కేసు నమోదు
- నిందితుల నుంచి నగదు స్వాధీనం
- కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసుల హెచ్చరిక



పేకాట స్థావరంపై దాడి చేస్తున్న పోలీసులు(ఫైల్)

కౌటాల: కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో పేకాట జోరుగా సాగుతోంది. పోలీసుల దాడుల్లో కొంత మంది పేకాటరాయుళ్లు అరెస్టవుతున్నా వారిలో మార్పు రావడం లేదు. గ్రామ శివారు ప్రాంతాల్లో పేకాట దందా సాగిస్తూ జేబులు గుల్ల చేసుకుంటున్నారు. యువత కూడా పేకాటకు బానిసలవుతుండడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. కాగా సరదాగా ఆడుకునే పేకాట కొందరికి వ్యసనంలా మారుతోంది. పెద్దమొత్తంలో డబ్బులు ఆడేవారంతా ఎవరికి అనుమానం రాకుండా ఉండేందుకు హోటళ్లు, అటవీప్రాంతాల్లో పేకాట ఆడుతున్నారు. కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, సిర్పూర్(టి) మండలాల్లో జోరుగా పేకాట ఆడుతున్నారు. మరో వైపు పేకాట సమాచారం రాగానే.. కొందరు పోలీసులు పేకాట రాయుళ్లకు ముందుగానే దాడుల సమాచారం చేరవేస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఈ నెలలో ఇప్పటి వరకు ఐదుగురిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఏటా జిల్లాలో పేకాటరాయుళ్లపై కేసులు నమోదు కాగా.. వారి వద్ద నుంచి రూ.లక్షల్లో నగదు స్వాధీనం చేసుకుంటున్నారు.

పులి ఇలాకాలోనే..

జూదరులు డబ్బులు పెట్టే స్థాయిని బట్టి గ్రూపులుగా విభజించి పేకాట ఆడుతున్నారు. కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో విస్తారంగా అడవులు ఉన్నాయి. అటవీశాఖ అధికారులు ఆ ప్రాంతాన్ని అధికారికంగా టైగర్ జోన్‌గా ప్రకటించకపోయినా పులి విస్తారంగా సంచరిస్తుంటుంది. గ్రామ శివారుల్లో పేకాట ఆడితే పోలీసులు దాడులు చేస్తున్నారని ఏకంగా పులి ఇలాకాలోనే పేకాట స్థావరాన్ని ఏర్పాటు చేశారు. జూదం ఆడే ప్రాంతంలోనే తరుచూ పులి సంచరిస్తుంటుంది. అయితే పులి తిరిగే ప్రాంతం కావడంతో అక్కడకు ఎవరూ రారని పేకాట ఆడుతున్నారు. అటవీ ప్రాంతాలల్లో పేకాట రాయుళ్ల పేకాట ఆడుతూ అటు అటవీశాఖ అధికారులు.. ఇటు పోలీసులకు సవాలు విసురుతున్నారు. కాగా పేకాట రాయుళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

కరపత్రం ఆవిష్కరణ

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని చిలుకూరి గార్డెన్స్‌లో ఫిబ్రవరి 19న నిర్వహించనున్న ఆర్యవైశ్య వధూవరుల పరిచయ వేదిక కరపత్రాన్ని శనివారం జిల్లా కేంద్రంలోని వాసవీ మందిరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేశాప్ కమిటీ ప్రతినిధి విఠల్‌రావు ఉప్‌లంచ్‌వార్ మాట్లాడారు. సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న 35వ పరిచయ వేదికను ఆర్యవైశ్య వధూవరులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తిగల వారు ఫిబ్రవరి 5లోపు బయోడేటా వివరాలు 9293750507 నంబర్ వాట్సప్‌కు పంపించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు అశోక్, శ్రీనివాస్, మధుకర్, వెంకన్న, మురళీధర్, వినోద్, శంకర్, మురళీధర్, మోహన్, విలాస్ దెబ్బటివార్, శ్రీనివాస్ దెబ్బటివార్ పాల్గొన్నారు.